# కర్నూలు । నంద్యాల వార్త

9 జనవరి 2023 | సోమవారం | పేజీలు 4


## ప్రతిఒక్కరు సేవాభావం కలిగి ఉండాలి..!

- మానవసేవే..మాధవసేవ..
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



**ఆలూరు, జనవరి 8, ప్రభాతవార్త**

ప్రతిఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రెన్యూపవర్ కంపెనీ ఆద్వర్యంలో వృద్దులు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మంత్రి జయరాం మాట్లాడుతూ చలికాలంలో అనాధలు, వృద్దులకు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రెన్యూపవర్ కంపెనీ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని అన్నారు. మానవసేవే..మాధవసేవ..అని ప్రతిఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణస్వామిలు పాల్గొన్నారు.

## మహిళా మాల్‌లో..
# అమ్మకాలు చేస్తేనే పొదుపు రుణాలు..!

- మాల్‌లో ఒక రేటు మార్కెట్‌లో మరో రేటు
- సరుకలను కొనుగోలు చేస్తే తంబు ఎందుకు వేయాలి..?
- సిసిలు,బుక్ కీపర్ల బెదిరింపులతో మాల్‌కి.. ఎగబడుతున్న మహిళలు

● వివరాలు 2లో




**కోడుమూరు, జనవరి 8, ప్రభాతవార్త ః**

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధిని సాధించే దిశగా మహిళా మార్టులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కోడుమూరులో కూడా అధికారులు మహళా మాల్‌ను ఏర్పాటు చేశారు. మాల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్క పైసా మంజూరు చేయాలేదనేది తెలిసిందే. అయితే ఇక్కడ ఉన్న వెలుగు అధికారులు, మండల మహిళా సమాఖ్య నేతృత్వంలో స్వంతంగా మహిళా మార్టును ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఇందుకు అవసరమయ్యే నగదు మొత్తంకు వెలుగు అధికారులు భారీ మొత్తంలో నగదును సేకరించారు. మండలంలో ఉన్న దాదాపు 1200 పొదపు మహిళా గ్రూపుల నుంచి భారీగా నగదను రాబట్టారు. ఒక్కొక్క మహిళా గ్రూపు దగ్గర నుంచి రూ.2వేలు దాకా వసూలు చేశారని తెలిసింది. వారి నుంచి సేకరించిన దాదాపు రూ.30లక్షల రూపాయలతో మాల్ ఏర్పాటు చేశారు. ఇంత భారీగా వసూలు చేసిన సొమ్ముతో తర్వాత నుంచి మహిళల నుంచి వసూలు చేసిన ఆ నగదును తిరిగి గ్రూపులకు ఎలా ఇస్తారనే విషయాలు ఎవ్వరికి సరైన సమాధానాలు లేవనే చెప్పాలి. అంతే గాక మహిళా మాల్‌కు సంబందించిన బైలాలో ఉన్న నిబంధనలు ఎమిటో కూడా సభ్యులకు తెలిపిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఇలా ఏర్పాటు చేసిన మాల్ నిర్వాహకులు మాల్ ఏర్పాటు తరువాత స్వంత నిర్ణయాలతోనే మాల్‌ను నిర్వహిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. కోడుమూరులో ఏర్పాటు చేసిన మాల్‌లో మండలంలోని ఆయా గ్రామాలలోని పొదుపు మహిళా గ్రూపుల సభ్యులంతా తప్పని సరిగా సరుకుల అమ్మకాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేగాక ఇక్కడి మాల్‌లో సరుకులను కొనుగోలు చేసిన వారికే పొదుపు రుణాలు మంజూరు చేస్తామని వెలుగు సిసీలు, బుక్ కీపర్లు మహిళలను బెదిరించి మాల్‌కు రప్పించడం గమనార్హం. మాల్‌లో తప్పని సరిగా తంబు వేస్తేనే పొదుపు రుణాలకు అర్హులని అల్టేమేటం చేయడం కొసమెరుపు. దీంతో మండలంలోని పొదుపు మహిళలంతా బెదిరిపోయి మాల్‌కి తరలివస్తున్నారు. ప్రతి రోజు మాల్ దగ్గర మహిళలు సరుకుల కోసం ఎగబడుతున్నారు. రోజు రోజుకి పెరిగి పోతున్న మహిళల తాకిడితో ఇక్కడి నిర్వాహకులు అర్ధాంతరంగా సరుకులను భారీ స్థాయిలో పెంచారు. బయటి మార్కెట్ లో సరుకుల ధరలు ఒక మాదిరిగా...

## నంచర్ల గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్ల నిర్లక్ష్యం..!

- నిబంధనలకు విరుద్దంగా చికిత్సలు
- కిడ్నీలు దెబ్బతిని ఇద్దరు మృతి



**మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్ల చేతివాటానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. నంచర్ల గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్ల నిర్లక్ష్యానికి గ్రామానికి చెందిన ఇద్దరి కిడ్నీలు దెబ్బతిని మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది.**

**చిప్పగిరి, జనవరి 8, ప్రభాతవార్త :**

గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్లు నిబంధనలకు విరుద్దంగా ఇంజక్షన్లు, సెలీన్ బాటిల్స్ మరియు అధిక డోసు కలిగిన మాత్రలు ఇచ్చి ఇష్టానుసారంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రామ మాజీ ఎంపిటిసి శివలింగ ఆరోపించారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ నంచర్ల గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్లు ఇష్టానుసారంగా నిబంధనలు పాటించకుండ చికిత్సలు చేస్తున్నారని అన్నారు. గ్రామంలో అడిగేనాథుడే లేక ఆర్ఎంపిలు తమకు వచ్చి రాని చికిత్సలు చేస్తునా న్నరని ఆరోపించారు. ప్రజలు వివిధ సమస్యలతో అనారోగ్యాలతో వెళితే వ్యాధికి తగ్గ ప్రథమ చికిత్స మరియు మందులు ఇవ్వకుండ అధిక డోస్ కలిగిన ఇంజక్షన్లు వేస్తున్నారని తెలిపారు. ఆర్ఎంపి డాక్టర్లు వేసిన పవర్ఫుల్ ఇంజక్షన్ల వల్ల గ్రామానికి చెందిన ఇద్దరు మహిళల ప్రాణాలు పోయాయని అన్నారు. ఈ విషయాన్ని చిప్పగిరి వైద్యాధికారి జమీల్ అహ్మద్‌కు చరవాణి ద్వారా ఫిర్యాదు చేశామన్నారు. ఆర్ఎంపి డాక్టర్లు నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఆర్ఎంపి డాక్టర్లను ఇలాగే వదిలేస్తే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతామని ఆరోపించారు. అదేవిధంగా గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్ల పనితీరుపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తానన్నారు. మండలంలోని నంచర్ల గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్ల చేతివాటంతో ఇద్దరు మహిళలు మృతిచెందారని ఆరోపిస్తున్నారనే విషయంపై డాక్టర్ జమీల్ అహ్మద్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా నంచర్ల గ్రామంలో జరిగిన విషయంపై విచారణ జరిపి ఆర్ఎంపి డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నంద్యాల మాదే..
# ఆళ్లగడ్డ మాదే..!

- భూమా....నంద్యాల మరువదు నిన్ను....
- పదవులు కాదు, ప్రజాశ్రేయస్సే ముఖ్యం
- దివంగత నేత భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలు
- మాజీ మంత్రి భూమా అఖీల ప్రియ





**నంద్యాల, జనవరి 8, ప్రభాతవార్తః**

జిల్లా కేం ద్రమైన నంద్యాల్లో దివంగత నేత మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలను పట్టణంలోని పద్మావతీనగర్‌లోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి అఖీల ప్రియ, యువ నాయకుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరాముడు అధ్వర్యంలో నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని భూమా అభిమానులు, కార్యకర్తలు వేలాది మందిగా తరలివచా ్చరు. ముందుగా అఖీలప్రియ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్వయంగా ఆమెతోపాటు ఆమె సోదరుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి రక్తదానం చేశారు. సుమారుగా 500 మంది పైచిలుకు కార్యకర్తలు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా బొమ్మలసత్రం నుంచి బైక్‌ర్యాలీగా బయలుదేరి పద్మావతీనగర్‌లోని కార్యాలయం వద్ద తరలివచా ్చరు. తోపుడుబండ్ల వ్యాపారం చేసుకునేవారికి ఉచితంగా తోపుడుబండ్లను పంపిణి చేశారు. వేలాదిగా తరలివచి ్చన కార్యకర్తలనుద్దేశించి భూమా అఖీల ప్రియ, సోదరుడు, భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి ఉద్వేగతంతో ప్రసంగించారు. పదవులు ముఖ్యం కాదని ప్రజాశ్రేయస్సే పరమావధి అని భూమా నాగిరెడ్డి అభిమానుల కోసం ఎంతటి త్యాగానికైనా, సిద్దంగా వుండేవాడని ఆయన ఆశయాల అమలుకోసం ఎంతవరకైనా పోరాడతామని పేర్కొన్నారు. కార్యకర్త లపై ఈగవాలినా సహించేదిలేదన్నారు. రాబోయో ఎన్నికల్లో టిక్కెట్ వచ్చినా, రాకున్నా ప్రజాసేవకోసం నిరంతరం పాటుపడతామని నంద్యాల్లో పేదలకు 10 టిడ్కో గృహాల ఏర్పాటుకు, రోడ్డు వెడెల్పు కార్యక్రమానికి, కుందూనదిపై వంతెన ఏర్పాటుకు, నంద్యాల నుంచి కర్నూలుకు పోయే రహదారి స్థలసేకరణ విషయంలోను, నంద్యాల నుండి మహానంది వెళ్లె రహదారి క్రాస్‌రోడ్డు వద్ద స్థల సేకరణతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన భూమా నాగిరెడ్డిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా గుర్తుండిపోయారని పేర్కొనా న్నరు. భూమా నాగిరెడ్డి మాట ఇస్తే నేరవేర్చేవంశమని, చనిపోయిన అనంతరం కూడ ఆ కోరికను తీర్చిన మహానేత అని అఖీల ప్రియ, జగత్‌విఖ్యాత్‌రెడ్డి కొనియాడారు. నంద్యాల్లో మా తమ్ముడు జగత్ విఖ్యాత్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఈస్థలంలో ఇల్లుకట్టుకొని ప్రజలకు అందుబాటులో ఉంటామని కార్యకర్తలను కాపాడుకోవడం మాబాధ్యత అంటూ ప్రకటించారు.

**బైక్‌ర్యాలీని అడ్డుకున్న పోలీసులు-అఖీల ప్రియ వాగ్వివాదంః**



దివంగత నేత భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా బైక్‌పై ర్యాలీగా వస్తున్న సుమారు 1000 మంది యువ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడికి చేరుకున్న భూమా అఖీల ప్రియ పోలీసులతో వాగ్వివాదం చేశారు. ఇదేం పార్టీ కార్యక్రమం కాదని భూమా నాగిరెడ్డి జయంతి అని కార్యకర్తలు, యువకులు ఉత్సా హంతో ఏవరికి అటంకం కలుగకుండా వస్తున ్నప్పుటికి అడ్డుకోవడం తగదని పేర్కొన్నారు. ఇక్కడ గెలుపుకోసం అహర్నిశలు కృషిచేస్తామని పోలీసులు నిష్పక్షపాతం వ్యవహారించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నంద్యాల, గోస్పాడు, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి, రుద్రవరం, దొర్నిపాడు, సంజామల, కోవెలకుంట్ల మండలాల నుంచి భూమా అభిమానులు, కార్యకర్తలతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎవిఆర్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు శివశంకర్ యాదవ్, ఒంటెలగల భాస్కర్‌రెడ్డి, కరిముల్లా, కాటంరెడ్డి తులశీశ్వర్‌రెడ్డితో పాటు మాజీ విఆర్వో మోహన్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సిద్దేశ్వరం వద్ద ఐకాన్ బ్రిడ్జి వదు.. రోడ్డు కమ్ బ్రిడ్జి బ్యారేజ్ కావాలి -బైరెడ్డి

- రాయలసీమ ముఖ్యమంత్రులుగా ఉన్న ఒరిగింది ఏమిలేదు
- సీమ ప్రజలలో చైతన్యం రావాలి
- 28న రాయలసీమ ప్రజా ప్రదర్శన



**నందికొట్కూరు, జనవరి 8, ప్రభాతవార్త:**

రాయలసీమ ప్రజలు బ్రతుకులు బాగుపడాలంటే సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జికి బదులుగా రోడ్ కమ్ బ్యారేజి కట్టాలని సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు రాయలసీమ నుండి ముఖ్యమంత్రులుగా కొనసాగిన సీమ ప్రజలకు ఒరిగింది ఏమిలేదని అంతా బూటకపు రాజకీయాలతో సీమను ఏడారి చేశారని ఇక నైన సీమ ప్రజలలో చైతన్యం రావాలని బైరెడ్డి పిలుపు నిచ్చారు. రాయలసీమలోని 4 జిల్లా లలో ఖనిజ సంపద, అటవి సంపద, ఐరన్‌ఓర్, పవర్ జనరేషన్ కోసం ఉష్ణోగ్రత వంటి సంపదలతో ఆధ్యాత్మిక కేంద్రాలుగా తిరుపతి, శ్రీశైలం, కాళహస్తి, ప్రపంచ దేశాలను ఆకర్షించే కేంద్రాలు ఉన్నాయని అయితే పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ పరిస్థితి అట్టడుగు స్థాయికి దిగజారి పోయిందని, దీంతో సీమ ప్రజలు, విద్యావేత్తలు(నిరుద్యోగులు) ఇతర రాష్ట్రాలకు వలసలు పోయి కూలీలుగా, మట్టి పని చేసుకొని జీవిస్తున్నారన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి పాలకులు సీమకు ద్రోహం చేస్తున్నారని, శ్రీశైలం ప్రాజెక్టు కోసం ఈ ప్రాంతవాసులు సర్వస్వం త్యాగం చేశారని, అయిన ఈ ప్రాంత రైతులకు ప్రజలకు సాగునీరు, త్రాగునీరు కరువైందని, చిల్లర ప్రాజెక్టులు రాలుస్తున్నారని ఆయన విమర్శించారు. ఐకాన్ బ్రిడ్జికి బదులుగా రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మిస్తే 70 టి.యం.సి.ల నీరు నిలువు చేసుకొవచ్చునని దీంతో హంద్రీనీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు, ఎస్.ఆర్.బి.సి.కి సమృద్ధిగా నీటితో సీమ సస్యశ్యామల మవుతుందని, రూ.1200 కోట్లతో ఐకాన్ బ్రిడ్జి నిర్మించడం కన్న కేవలం రూ.700ల కోట్లతో రోడ్డు కమ్ బ్యారేజ్ నిర్మిస్తే ప్రభుత్వాలకు 500 కోట్లు మిగులుతాయన్నారు. శ్రీశైలం జలాశయం నిర్మాణం కన్న ముందే సిద్దేశ్వరం వద్ద క్రిష్ణా, పెన్నా ప్రాజెక్టు నిర్మాణం కోసం 1951లోనే ప్లానింగ్ కమీషన్ అనుమతి ఇచ్చిందని అదే జరిగి ఉంటే రాయలసీమకు నికరంగా 400 టి.యం.సి.లు జలాలు అందుబాటులో ఉండి రాయలసీమలో లక్షల ఎకరాలకు సాగునీరు అంది ఏడాదికి మూడు పంటలతో సీమ కళకళలాడేదన్నారు. కొందరి కుయుక్తల వలన మనకు ప్రాజెక్టు రాలేదని దీంతో క్రిష్ణా డెల్టాకు, నాగార్జునసాగర్‌కు శ్రీశైలం ప్రాజెక్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారిందని, ఆకారణంగా రాయలసీమ ఒడిలో క్రిష్ణానది పారిన గొంతు తడుపుకునేందుకు నీరు లేక అల్లాడి పోతున్నామని, పాపం అంతా సీమ నుండి ముఖ్యమంత్రులుగా కొనసాగిన వారిదేనని దీనిపై ప్రజలు గళం విప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ -నంద్యాల మీదుగా జాతీయ రహదారి 167 కెని ప్రతిపాదించి , సిద్దేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందన్నారు. అయితే రాయలసీమ వాసుల ప్రధానమైన డిమాండ్‌గా ఐకానిక్ బ్రిడ్జ్‌కు బదులుగా రోడు కమ్ బ్యారేజి నినిర్మించాలని అలా చేస్తే సీమవాసులకు సాగు, త్రాగునీటి అవసరాలతో పాటు ఇరు ప్రాంతాల రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు. రోడ్ కమ్ బ్రిడ్జ్ సాధించేందుకు రాయలసీమ స్టీరింగ్ ఏర్పాటు అయిందని ఈ నెల 28న ఛలో సిద్దేశ్వరం, సంగమేశ్వరం కార్యక్రమంతో రాయలసీమ ప్రజా ప్రదర్శన నిర్వహిస్తున్నామని సీమ ప్రజలు అందరు బాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

## జలవనరులశాఖ ప్రభుత్వ గృహంలో గుత్తేదారుడు 'మఖాం'..!

: అదికారులు ఖామ్ అవ్వడంలో లోగుట్టు మంత్రం ఏమిటి...?
: ప్రభుత్వ ఖజానాకు చిల్లు,చోద్యం చూస్తున్న అదికారులు




**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి08, ప్రభాతవార్త**

సొమ్ము ఒకరిది...,సోకు మరోకరది... అన్న సామేతలా శ్రీశైలం ప్రాజెక్టు జలవనరులశాఖ ప్రభుత్వ గృహంలో ఆర్.డబ్ల్యూ.ఎస్. గుత్తేదారు మఖాం వేసాడు. జలవనరులశాఖ అదికారులు ఖామ్, ఖామ్ అవ్వడంలో లోగుట్టు మంత్రం ఏమిటి...? ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడుతున్న అదికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహారించడం ప్రాజెక్టు కాలనీలో చర్చానీయాంశంగా మారింది. వసతి గృహం ఏమో జలవనరులశాఖది, గుత్తేదారుడేమో ఆర్. డబ్ల్యూ.ఎస్. గుత్తేదారుడు. ఈ గుత్తేదారుడి మఖామ్‌కు జలవనరులశాఖ అదికారుల అనుమతులు ఉన్నాయే లేవో కాని రమారమి ఒకటిన్నర సంవత్స రంకు పైగా దర్జాగా అక్రమణ చేసుకోని కాలం వెల్లబుచ్చుతున్నాని కాలనీలో పుకార్లు శికార్లు చేస్తున్నాయి. ఈ యొక్క ఆర్. డబ్ల్యూ.ఎస్ గుత్తేదారుని వసతికి జలవనరులశాఖ అనుమతులు ఇచ్చిందా...? లేక రాజాకీయ నాయకుల అండదండలతో వసతి గృహంను అక్రమణ చేసుకోని పబ్బం గడుపుతున్నాడా...? అనేది వెలుగు చూడాల్సి ఉంది. గుత్తేదారుడు అక్రమణ చేసుకున్న వసతి గృహం విషయం జలవనరులశాఖ తెలిసి లోగుట్టు ఒప్పందంతో ఖామ్‌గా ఉందా...? లేక లిఖిత పూర్వకమైన ఒప్పందం కుదుర్చుకోని ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడకుండా వ్యవహరిస్తుందా...? అనేది కాలనీ వాసుల్లో ప్రశ్నర్థాకంగా మారింది. వివరాల్లోకి వెళితే నంధ్యాల జిల్లా శ్రీశైలం నియెజకవర్గం శ్రీశైలం మండలం సుండిపెంట కాలనీవాసుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం రమారమి రూ.7 కోట్ల నిధులను మంజూరు చేస్తే పనులను చెజిక్కించుకున్నది సి.ఆన్.ఫర్మ్‌కు చెందిన సంస్థ చెందిన గుత్తేదారుడు. ఈ గుత్తేదారుడు సుండిపెంట కాలనీలో మంచీనీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, నూతన పైప్‌లైన్ల నిర్మాణా పనులను చేయాల్సి ఉంది. ఈక్రమంలోనే పనులను ప్రారంభించిన నేపధ్యాంలో స్థానికంగా జలవనరులశాఖకు చెందిన ఈఈ 09 నెంబర్ గల వసతి గృహంపై కన్నేసాడు. తదుపరి గుత్తేదారుడు అనుకున్నదే తరువు తమ దగ్గర పనిచేసే వర్కర్లను ఇక్కడే మఖాం వేయించి తన రోజువారి పనుల కార్యకలపాలను ఇక్కడి నుండే కొనసాగిస్తున్నాడు. ఈ ఆర్. డబ్ల్యూ.ఎస్ కు చేందిన గుత్తేదారుడికి లోగుట్టు ఒప్పందంతో ఏమైనా ఇచ్చిందా...? లేక రాజకీయ పార్టిల నాయకుల ఒత్తిడితో ఏమైన ఇచ్చిందా...? లేక ఇరుశాఖల ఒప్పంద సమన్వయంతో ఇచ్చిందా...? అనే ప్రశ్నలకు సమాదానం వెల్లడికావాల్సి ఉంది. ఈ విషయంపై ప్రభాతవార్త జలవనరులశాఖ అదికారులను పలకరిస్తే కొందరు అదికారులు తలా ఓ మాట అన్నచందంగా పొంతలేని మాటలు చెప్పడం గమనార్హం. ఈ పనులు నిర్వహిస్తున్న ఆర్.డబ్ల్యూ.ఎస్ గుత్తేదారుడితో కుదుర్చుకున్న పనుల పూర్తి ప్రక్రియ ఇప్పటికే 2022 డిసెంబర్ నాటికి సమయం కూడా ముగిసింది. అయినప్పటికి పనులు అసంపూర్తిగానే నత్తనడకన సాగుతున్నాయి. పనులను పర్యవేక్షించాల్సి న ఆర్.డబ్ల్యూ.ఎస్ అదికారులు మొక్కుబడిగా అమావాస్యకో, పుణ్ణాన్నికో అన్నచందంగా తొంగి చూడడంతోనే పనులు వేగవంతం కాలేదన్న విమర్శలు కాలనీ వాసుల నుండి వెల్లవేత్తుతున్నాయి. ఏది ఏమైనప్పటికిని జలవనరులశాఖ వసతి గృహంలో పాగా వేసిన ఆర్.డబ్ల్యూ.ఎస్ గుత్తేదారుడి నుండి ఖజానాకు చిల్లు పడకుండా పైకం వసూళ్లు చేయాల్సి న అవసరం ఎంతైన ఉందని కాలనీ వాసులు కోరుతున్నారు. అదే విధంగా నత్తనడకన పనులు సాగిస్తున్న గుత్తేదారుడిపై ఆర్.డబ్ల్యూ.ఎస్ ఆదికారులు ఎటువంటి చర్యలకు ఉపక్రమిస్తారో వేచిచూడాల్సి ఉంది.



## ముగిసిన ఈడిగ శివకుమార్‌గౌడ్..
# అంత్యక్రియలు

- అంత్యక్రియల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య
- హత్యకు పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలి



**కౌతాళం, జనవరి08, ప్రభాతవార్త ;**

కౌతాళం మండలంలోని నదిచాగి-కుంబళూరు మధ్య బీజేపీ నాయకుడు ఈడిగ శివకుమార్‌గౌడ్ గత శనివారం దారుణహత్యకు గురైన విషయం విధితమే. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ పురుషోత్తంరెడ్డి, కపిలేశ్వరయ్య, రామస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధితా కుటుంబాన్ని పరామర్శించారు. బాధితా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసుశాఖను డిమాండ్ చేశారు. బాధితా కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈడిగ శివకుమార్‌గౌడ్ మృతి బాధాకరమని వాపోయారు. మంచి నాయకుడిని కోల్పోయామని కంటతడి పెట్టుకున్నారు. అంతిమయాత్రలో నాయకులు నదిచాగి గ్రామ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హంతకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు ; సీఐ

### - ఐదుగురిపై కేసు నమోదు

**కౌతాళం, జనవరి07, ప్రభాతవార్త ;**

మండలంలోని నదిచాగి ఈడిగ శివకుమార్‌గౌడ్ హత్య కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎరిషావలి, ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నదిచాగి గ్రామ వైసీపీ నాయకుడు రామన్నగౌడ్, బసన్నగౌడ్, దేవన్న కుమారులు రాముడు, మునియప్పలపై కేసు కట్టి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నదిచాగి గ్రామంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హంతకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రశాంతమైన గ్రామాల్లో ఎవరైనా అలజడులు సృష్టించినా, హత్యకు పాల్పడినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

# భూ హక్కు పత్రంతో పొలం యజమానికి భరోసా..

**- భూహక్కు పత్రాలు పంపిణీ..**

వందగల్లు(కోసిగి), జనవరి 8, ప్రభాతవార్త ఎన్నో ఏళ్లుగా భూ తగాదాలతో ఇబ్బందులు పడుతున్న పొలం యజమానులకు భూ హక్కు పత్రంతో వారికి యాజమాన్యపు భరోసా ప్రభుత్వం కల్పిస్తుందని ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి అన్నారు.. ఆదివారం మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో మండల ఇంచార్జీ మురళీమోహన్‌రెడ్డితో కలసి సర్పంచ్ కాల్వ కొరవాంజినమ్మ అధ్యక్షతన భూ యజమానులకు భూ హక్కు పత్రాలను ఎంఎల్ఏ అందించారు.. ఈ సందర్భంగా తహశీల్దార్ రుద్రగౌడ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రతి నిత్యం భూమి కోసం ఇరు వైపుల రైతులు గొడవలు పడేవారని, కొద్దిపాటి స్థలం కోసం నాది నాది అంటూ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ తీవ్రంగా నష్టపోయేవారన్నారు.. అయితే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న నేతృత్వంలో భూ సర్వేను సక్రమంగా నిర్వహించి పొలం సాగులో ఉంటున్న రైతుకు హక్కు పత్రాలను అందించడం జరిగిందన్నారు.. ప్రస్తుతం వందగల్లు గ్రామంలో సుమారు 2321 ఎకరాలకు సంబందించి 982 మంది రైతులకు భూ సర్వే ద్వారా వారికి భూ హక్కును కల్పించడం జరిగిందని తెలిపారు.. అనంతరం వివిధ గ్రామ రైతులకు పత్రాలను అందించారు.. ఈ కార్యక్రమంలో ఆర్ఐ



తిక్కస్వామి, విఆర్‌వో బసవరాజు, లక్ష్మన్న, వివిధ గ్రామాల నాయకులు, నాయకులు బెట్టన్నగౌడ్, నాడుగేని నరసింహులు, పశువుల లక్ష్మన్న, కాల్వ తదితరులు పాల్గొన్నారు..

## మహిళా మాల్‌లో అమ్మకాలు చేస్తేనే పొదుపు రుణాలు

**( తరువాయి )** ఉంటే మాల్‌లో మరో విధంగా ఉన్నాయని కూడా మహిళలు వాపోతున్నారు. ఇలా తమ నుంచి మాల్ నిర్వాహులకు భారీ స్థాయిలో దోపిడికి గురి చేస్తున్నారని సభ్యులు ఆరోపిస్తున్నారు. సమావేశం ఉందని దండోరా వేయించి మాల్‌కు రప్పించారు : కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలోని పొదుపు మహిళలకు వెలుగు సిసి నారాయణ, బుక్ కీపర్ గంగన్నలు సమావేశం ఉందని గ్రామంలో దండోరా వేయించారు. దీంతో హుటాహుటిన పొదుపు మహిళలు భారీగా కోడుమూరు వెలుగు కార్యాలయంకు చేరుకున్నారు. తీరా అక్కడి కార్యాలయం మూత పడిన విషయం గమనించిన మహిళలు వెలుగు సీసీకి ఫోన్‌లో సంప్రదించారు. ఈ మేరకు ఆ సిసి అక్కడి నుంచి పొదుపు మహిళల మార్టుకు వచ్చి మాల్‌లో సరుకులను కొనుగోలు చేయాలని అప్పుడే పొదుపు రుణాలు అందిస్తామని ఒత్తిడి తెచ్చారు. దీంతో మహిళలంతా మాల్‌కు ఒక్క సారిగా ఎగబడ్డారు. ఒక్క సారిగా మాల్‌కు మహిళలు పొటేత్తారు. తామంతా ప్రతి రోజు కూలీ నాలి చేసుకొని జీవనం చేసుకొని బతుకు బండిని లాగిస్తున్నామని, తమకు సమావేశం ఉందని వెలుగు కార్యాలయంకు రప్పించి బెదిరించడం ఏమిటని అనుగొండ గ్రామానికి చెందిన మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఎన్నాళ్లు బెదిరించి తమ నుంచి బలవంతపు అమ్మకాలు చేయిస్తారని, ఇక్కడ ఉన్న సరుకులు తమ ఊళ్లోనే ఇక్కడి కంటే తక్కువ ధరలకే సరులకు దొరుకుతాయన్నాని వారు తీవ్ర ఆగ్రహాలు వ్యక్తం చేశారు. ఏది ఎమైన కోడుమూరులో ఏర్పాటు చేసిన మహిళా మాల్‌లోని నిర్వాహుకులు చేస్తున్న బలవంతపు అమ్మకాలుపై సభ్యుల నుంచి రోజు రోజకి తీవ్ర స్థాయిలో వ్యతిరేకతలు రావడం శోచనీయం.

## బిజీబిజీగా మండల టిడిపి నాయకులు

**మద్దికెర,జనవరి 8,ప్రభాతవార్త :** మండలంలోని టిడిపి నాయకులు ఆదివారం బిజీబిజీగా గడిపారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కెఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు ఆధ్వర్యంలో బసినేపల్లి,పెరవలిలో మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో,మండల కేంద్రమైన మద్దికెరలో టౌన్ ప్రెసిడెంట్ గడ్డం రామాంజనేయులు సమక్షంలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాన్ని గడప గడపకు వెళ్లి వివరిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మండలంలో వైసిపి పార్టీ భూస్థాపితం అవ్వడానికి రోజులు దగ్గరపడ్డాయని పనికిరాని పథకాలు పెట్టి పేదలధనాన్ని వృధా చేస్తున్నారన్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ఉత్తరాన్ని పూర్తి చేసి చరవాణి ద్వారా పార్టీకి కేటాయించిన నంబర్‌కు ఫోన్ చేయడం జరిగింది.

## అరసం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**పత్తికొండ,జనవరి 8,ప్రభాతవార్త :** ఈ నెల 29న పట్టణంలో జరిగే అరసం జిల్లా మహాసభలు మరియు కవి సమ్మేళనం,అభ్యుదయ రచయితల సంఘం సభలు జయప్రదం చేయాలని అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద్,ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణలు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రముఖ అభ్యుదయ కవి మూర్తుజా అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో వక్తలు మాట్లాడుతూ అరసం ఆవిర్భవించి 80వసంతాలు పూర్తయిన సందర్భంగా వివిధ సాహిత్య అంశాలపై ప్రముఖ కవులచే ఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఈ సభలకు ముఖ్యఅతిథిగా అరసం రాష్ట్ర అధ్యక్షులు,ప్రముఖ సాహితీ విమర్శకులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కవి సమ్మేళనంలో మంచి కవితలను వినిపించే కవులకు ప్రసంశాపత్రాలు,బహుమతులు అందచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పుల్లా రామాంజనేయులు,సహాయ కార్యదర్శులు సయ్యద్ జహీర్ అహ్మద్,శంకర్ రావు,రామమోహన్‌రెడ్డి,యువ కవి రాజారమేష్,వెంకటేష్ తదితరులున్నారు.

## నేడు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి రాక

**మద్దికెర,జనవరి 8,ప్రభాతవార్త :**

మండల కేంద్రానికి నేడు పత్తికొండ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవమ్మ విచ్చేయనున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. నేడు మద్దికెరకి విచ్చేయనున్నట్లు ఎంపిడిఓ నరసింహమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున అన్ని శాఖల అధికారులు,గ్రామస్థాయి అధికారులు,4సచివాలయాల సిబ్బంది, వాలంటరీలు తప్పకు హాజరు కావాలన్నారు. గైర్హాజరైన వారి వివరాలు తదుపరి క్రమశిక్షణ చర్యల నిమిత్తం కలెక్టర్‌కి నివేదించబడునని ఎంపిడిఓ తెలిపారు.

## రైతులపాలిట శాపంగా మారిన ప్రభుత్వాన్ని సాగనంపండి

**- టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య**



**బేతంచెర్ల,జనవరి8,ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులకు అన్ని రకాలుగా ఆదుకుంటున్నామని ప్రకటనలు ఇస్తూ శాపంగా మారినా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య అన్నారు.ఆదివారం మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో స్థానిక నాయకులు కృష్ణుడు,శశికుమార్,శివయ్యల ఆధ్వర్యంలో జరిగిన ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అహర్నిశలు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదన్నారు.మండలంలోని ఎంబాయి,రుద్రవరం,మండ్లవానిపల్లె ప్రాంతాల్లో ఉల్లి పంట సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేక పంటలను పొలాల్లోనే వదిలేసే దుస్థితి తెచ్చింది ఈ ప్రభుత్వమేనని ఆయన అన్నారు.అలాగే సీతారామాపురం,శంకరాపురం,బయనపల్లె గ్రామాల్లో చామంతి సాగుచేసిన రైతులు సైతం గిట్టుబాటు ధర లేక పంటలను చేనులోనే వదిలేసి దుక్కి చేయడం జరిగిందన్నారు.రైతుల కోసం గత ప్రభుత్వాలు రాయతీలు ఇచ్చి పనిముట్లు,విత్తనాలు,ఎరువులు అందజేస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటన్నింటికి స్వస్తి పలికిందన్నారు.ఇలాంటి ప్రజా,రైతు,కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే సాగనపంపాలని టీడీపీకి అధికారం కట్టబెట్టాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాయక్,క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు,వాసు,సెటిల్‌మెంట్ శెట్టి,మాజీ ఎంపిటిసి సభ్యుడు జాకీరుల్లా బేగ్,మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్,ఫయాజ్,అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి -డిఎస్పీ'

**బెలుం(కొలిమిగుండ్ల), జనవరి 8, ప్రభాతవార్త :** ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో వుంచుకొని, వాహన చోదకులు, ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆళ్లగడ్డ డిఎస్పీ సుధాకరరెడ్డి పెర్కొన్నారు. ఆదివారం రాత్రి కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గ్రామంలో ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాక్టర్ డ్రైవర్లకు, అమాలీలకు, ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలని, అతిగా స్పీడు వెళ్లరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రాణాలు ఎంతో విలువైనవన్న విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది తమ విలువైన ప్రాణాలను పొగొట్టుకుంటున్నారని డిఎస్పీ పెర్కొన్నారు.

## బీసీ రాజారెడ్డి ఔదార్యం

**- ఎన్‌టీఆర్ అభిమానికి ఆర్థిక సహాయం - మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి**

**బనగానపల్లె రూరల్,జనవరి8,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణం భానుముక్కలకు చెందిన ఉస్మాన్ అలియాస్ ఎన్‌టీఆర్(ఎన్‌టీఆర్ అభిమాని)కు బనగానపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం ఆయన కార్యాలయం వద్ద ఆర్థిక సహాయం అందించి కొత్త దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,తెలుగు ప్రజల ఆరాధ్యదైవం,దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు ఉస్మాన్ ఎంతో వీరాభిమాని అని ఆయన అన్నారు.ఎన్‌టీఆర్ అభిమాని,టీడీపీ కార్యకర్తగా ఉన్న ఉస్మాన్ గత కొంత కాలంగా కాలుకు దెబ్బతగిలి కూలీ పనులకు సైతం వెళ్లలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న బీసీ రాజారెడ్డి ఆదివారం ఉస్మాన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని అనంతరం ఆర్థిక సహాయం అందించి కొత్త దుస్తులు పంపిణీ చేశారు.ఉస్మాన్ టీడీపీకి వీరాభిమాని అని భవిష్యత్‌లో అతని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గం ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రాయలసీమ సలాం,నుశి విష్ణువర్ధన్‌రెడ్డి,షబ్బీర్,అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో I పై చంద్రబాబు,పవన్ కళ్యాణ్‌ల ప్రకటనతో ప్రభుత్వ వెన్నులో వణుకు

**- ధర్మవరం సుబ్బారెడ్డి**

**బేతంచెర్ల,జనవరి8,ప్రభాతవార్త:** రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో 1ను విడుదల చేసి తన నుయ్యిని తానే తవ్వుకున్నట్లు చంద్రబాబు,పవన్ కళ్యాణ్‌లతోపాటు ఇతర విపక్షాలు ఏకతాటి పైకి రావడంతో ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిందని డోన్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు.ఆదివారం గౌరిపేటలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన నియంత పోకడలతో ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు తీసుకువచ్చిన చీకటి జీవో 1ను ఆయననే ఇంటికి పంపించేందుకు పనికొచ్చిందని ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్,టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడితో కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడడంతోపాటు వీధి పోరాటాలకు సైతం సిద్ధమని ప్రకటించడంతో ఇక జగన్ ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయమని ఆయన అన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్షాలతోపాటు కేంద్రంలోని బీజేపీతో కలిసి పోరాడుతామని పవన్ కళ్యాణ్ ప్రకటించడం ఇక అరాచక పాలనకు తెరపడినట్టేనన్నారు.ఇక నుండి నియంత పోకడలకు కాలం చెల్లిందని ప్రజలే తిరగబడే కాలం మొదలైందని ఆయన అన్నారు.అనంతరం ఇంటింటికి వెళ్లి ఇదేం ఖర్మ కరపత్రాలను పంచుతూ సైకో పాలనను సాగనంపి సైకిల్ పాలనకు స్వాగతం పలకాలని ప్రజలను కోరారు.ఆయనతోపాటు టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి,మదిపెద్ది నాగేశ్వరరెడ్డి,నియోజకవర్గ సలహాదారు తిరుమలేష్ చౌదరి,డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్,నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షులు రేగటి భీమారెడ్డి,పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం సుధాకర్,శ్రీరాములు,అరుణ్ కుమార్,నంద్యాల పార్లమెంట్ అధికార ప్రతినిధి రూబెన్,ఆవుల రామకృష్ణ, రామ్మూర్తి,టైలర్ రాముడు,నంద్యాల మధు,సూర్యచంద్రారెడ్డి,గూటం శివ,పలువురు నాయకులు,ఉన్నారు.

## వాల్మీకులు ఐక్యమత్యంతో పోరాడుదాం



**నంద్యాల, జనవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వాల్మీకులు ఐక్యమత్యంతో ఏదైనా సాధించుకోవచ్చని శాశించే విధంగా వాల్మీకులు పోరాటం సాగించాలని రాష్ట్ర వాల్మీకి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గోవిందనాయుడు పేర్కొన్నారు.60 సంవత్సరాలకు పైగా వాల్మీకులు ఎస్టీ అంశంపై పోరాడుతున్నప్పటికి వాటిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రాంతీయ వ్యత్యాసం తొలగించాలనే ఉద్యమాల ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం గవర్నర్ ప్రసంగంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తామని ఈనేపథయంలో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక తయారుచేసి పంపిస్తామన్నారు. ఆంధ్ర యూనివర్సిటి ప్రొఫెసర్లను రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకుల స్థితిగతులు, ఆచార్యవ్యవహారాలపై 11 నెలల పాటు సుదీర్ఘంగా అధ్యాయనం చేశారని పేర్కొన్నారు. వాల్మీకుల పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వాలు వ్యవహరించాలని ఈరాష్ట్ర ప్రభుత్వం మరోసారి తీర్మాణాన్నికేంద్రానికి పంపి వాల్మీకులకు న్యాయం చేయాలని కోరారు. వాల్మీకులలో గోత్రనామాలు ఒక్కటే. మీకు మాకు ఎలాంటి అభిప్రాయబేదాలు లేకుండా ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని ఆయన డిమాండ్‌చేశారు.జాతీయ వాల్మీకి ఐక్యపోరాట సమితి అధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వాల్మీకి జాతీయ ప్రధాన కార్యదర్శి గోవిందనాయుడు మండల కమిటీని నియమించి ప్రకటించారు. ఈకార్యక్రమానికి మండలస్థాయి నాయకులు సీతారామయ్య,చంద్రశేఖర్, వెంకటరాముడు, వుశేనయ్య, వాల్మీకి పెద్దలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించాలి - కళలకు పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్

**-మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్**



**నంద్యాల హాస్పటల్, జనవరి 8, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కళలకు పుట్టినిల్లు అని కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, గతంలో నాటకాలు అంటే ప్రతిఒక్కరు హాజరై చివరి వరుకు వుండి అందులోని సారాంశాన్ని గ్రహించేవారని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. అజో విభో కందాళం ఆమెరికా ఫౌండేషన్, మరియు నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ సంయుక్త నిర్వహణలో గత మూడురోజులుగా పట్టణంలో టౌన్‌హాల్ నందు రాష్ట్రస్థాయి సాహితీ నాటక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. అజో విభో కందాళ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యానారాయణ, కళారాధన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డా.మధుసూదన్‌రావు, డా.రవికృష్ణల నిర్వహణలో ప్రముఖ సాహితీ వేత్త ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫౌండేషన్ తరుపున డా.కోడూరి ప్రభాకర్‌రెడ్డికి ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం లక్షరూపాయల నగదు బహుమతిని అందించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అజో విభో కందాళం ఫౌండేషన్ గత 30 సంవత్సరాలుగా తెలుగుబాష ఉన్నతికి సాహితీవికాసానికి చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. సాహితీ జీవితంపై దూరదర్శన్ మాజీ డైరెక్టరు జనరల్ డా.ఆర్ అనంతపద్మనాభరావు, వరంగల్‌కు చెందిన సాహితీ వేత్త డా.గిరిజా మనోహర్‌బాబు, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డా.గెలివిసహదేవుడు ప్రసంగించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యానారాయణ మాట్లాడుతూ తెలుగుబాష వికాసానికి, తెలుగుసంస్కృతి కళలను ప్రోత్సహించడానికి ఈఫౌండేషన్ గత 30 సంవత్సరాలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో కూడ ఈకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**బనగానపల్లె,జనవరి8,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978-80 ఇంటర్మీడియేట్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.పూర్వ విద్యార్థుల సకుటుంబ సమ్మేళానాన్ని నిర్వహించుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.42ఏళ్ల ఇంటర్ విద్య తరువాత వివిధ పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వీరంతా పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని చాలా సంవత్సరాల క్రితం విడిపోయిన విద్యార్థులు ఒకచోట కలుసుకుని సంతోషాన్ని పంచుకున్నారు.అప్పటి ఫిజిక్స్ లెక్చరర్ శ్రీ ఆంజనేయులు ప్రత్యేక అతిథిగా హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు.టి.మాధవరెడ్డి అధ్యక్షతన అపూర్వ సమ్మేళనాన్ని శ్రీ ఆంజనేయులు జ్యోతి ప్రజ్వలన గావించి సమావేశం నిర్వహించారు.అనంతరం పూర్వపు విద్యార్థుల పరిచయ కార్యక్రమం తదుపరి లెక్చరర్ ఆంజనేయులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సమేతంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.పూర్వ విద్యార్థులు కోడూరు హరినాథరెడ్డి,ఈ.వి.రమణ, అక్బర్ బాషా,ఎస్.పి.నాగరాజు,యు.రాజశేఖర్,వేణుగోపాల్,యూసుఫ్ హుస్సేన్,భూమా తులసీశ్వరరెడ్డి మరియు సుమారు 300 మంది పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.తదనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా టి.మాధవరెడ్డి,సెక్రటరీగా ఈ.వి.రమణ,ట్రెజరర్‌గా అక్బర్ బాషా,ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.పి.నాగరాజు,గౌరవాధ్యక్షులుగా కె.హరినాథరెడ్డి,భూమా తులసీశ్వరరెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది.మిగతా కార్యవర్గాన్ని త్వరలో పూర్తి చేస్తామని అధ్యక్షులు మాధవరెడ్డి తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**బనగానపల్లె, జనవరి8,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని జూనియర్ కళాశాలలు,డిగ్రీ కళాశాలల విద్యార్థిని,విద్యార్థులకు వ్యాసరచన పోటీ పరీక్షలు యువతకు స్వామి వివేకానంద సందేశం అనే అంశం పై ఎస్వీ డిగ్రీ కళాశాల నందు ఆదివారం ఉదయం వ్యాసరచన పోటీలు నిర్వహించారు.శ్రీ హట్టిమునిస్వామి దేవస్థానం వారు మరియు విశ్వహిందు పరిషత్ వారి ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు.వీరందరికి ఈనెల 12వ తేది గురువారం నాడు శ్రీ హట్టిమునిస్వామి దేవస్థానం ప్రాంగణంలో వివేకానంద స్వామి జయంతి నిర్వహించి బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని విశ్వహిందు పరిషత్ జిల్లా సలహాదారుడు దొంతా వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గురుజీ రామశేషయ్య,రిటైర్డ్ ఉపాధ్యాయుడు గుద్దేటి సుధాకర్‌రెడ్డి,విశ్వహిందు పరిషత్ బనగానపల్లె ప్రకాండ కార్యదర్శి ఓబుళరెడ్డి,ఉపాధ్యాయులు పి.వి.నరసింహులు,హరిప్రసాద్,రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీరాములు,పి.వి.శివయ్య, వెంకటసుబ్బయ్య, వి.సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో హిట్లర్ పాలనకొనసాగుతుంది.

**గోనెగండ్ల జనవరి 8 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజ్యం కొనసాగడం లేదని హిట్లర్ పాలన కొనసాగుతుందని గోనెగండ్ల మాజీ ఎంపిపి టీడీపి సీనియర్ నాయకులు వేముగోడు కేవీ కృష్ణారెడ్డి అన్నారు.వైసీపీ చేస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ హిట్లర్ పాలనను పుస్తకాల్లో చదువుకున్నామే తప్ప చూడలేదు. కాని వైఎస్ జగన్ పుణ్యమా అని నేడు కనులారా చూస్తున్నామని ఆయన ఆవేదనతో అన్నారు.మహిరంగ సభలు సమావేశాలు,ర్యాలీలు,రోడ్డు షోలు లేకుండా చీకటి జీవో నెం1ని తీసుకురావడం బ్రిటిష్ పాలనను చూపిస్తుందన్నారు.ప్రజలలో టీడీపీ కి వస్తున్న ప్రజాస్పందనను చూసి ఓర్వలేక సీఎం ఈలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు.చీకటి జీవో నెం1ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జగన్ సీఎం పదవి చేపట్టిన నాటి నుంచి అన్ని ప్రజా వ్యతిరేఖ విధానాలనే అవలంబిస్తున్నాడని ఆయన గుర్తు చేశారు.ప్రభుత్వం మారిన వెంటనే రాజధాని ని మార్చాలని నిర్ణయం తీసుకున్నాడు,ఇలాంటి సంఘటనలు దేశంలో ఎక్కడైనా జరిగాయా అని ఆయన ప్రశ్నించారు.13జిల్లాల రాష్ట్రానికి మూడు రాజధానులు అవసరమా అని ప్రశ్నించారు.మంత్రులు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావటం లేదు.ప్రస్తుతం పండిన పంటకు గిట్టుబాటుధర లేక చేసిన అప్పులు ఏలా తీర్చాలీ దేవుడా అంటు రోజుకో రైతు గుండె అగి ఆవేదనతో మృతి చెందుతుంటే ప్రభుత్వంకు చీమ కుట్టినట్టు కూడా లేదని ఆయన అన్నారు.మాజీ సీఎం చంద్రబాబు పోరాటం వృధాకానియ్యం అని ఆయన తెలిపారు.

## స్త్రీనిధి రుణాలు చెల్లించిన అప్పుగా చూపిస్తున్నారు

**- సంబంధిత బుక్‌కీపర్లను విచారించి న్యాయం చేయాలని వేడుకుంటున్న పొదుపుసంఘాల మహిళలు...**



**వెల్దుర్తి,జనవరి8,ప్రభాతవార్త :** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైకెపి (వైఎస్సార్ కాంతి పథం) కింద పొదుపుసంఘాల మహిళలకు బ్యాంకు లింకేజి,స్త్రీనిధి,ఉన్నతి రుణాలు అందిస్తుంది.అయితే మండల కేంద్రమైన వెల్దుర్తిలో వైకెపిలో తీసుకున్న స్త్రీనిధి,ఉన్నతి రుణాలు పూర్తిగా చెల్లించినను బ్యాంకుల్లో ఇంకా అప్పు ఉన్నట్లు బ్యాంకు,వైకెపి అధికారులు తమను అడుగుతున్నారని పట్టణంలోని 14వవార్డు,ఐజినగర్ మహిళలు ఆరోపిస్తున్నారు.14వ వార్డులోని ఇలాహి,ఇంద్రధనస్సు,మనిషా గ్రూపులు స్త్రీనిధి కింద రుణాలు తీసుకున్నారు.అయితే వారు తాము తీసుకున్న రుణాలను తమ గ్రూపులకు సంబంధించిన బుక్‌కీపర్లకు పూర్తిగా చెల్లించామని తెలిపారు.చెల్లించినను ఇంకా తమ పేర్లపై లక్షలు,వేలల్లో అప్పు ఉండడం ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తాము ఇబ్బందులు పడుతూ మరల రుణం కావాలంటే తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించాలని అధికారుల మాట ప్రకారం కడుతూ పూర్తిచేశామన్నారు.ఇందుకు సంబంధించిన బుక్‌కీపర్లను విచారించి తగుచర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.

## రాష్ట్ర అభివృద్ధిని మరిచిన సీఎం...

**- వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయ్**

**- తిరుపాడు గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించిన టీడీపీ నాయకులు**



**గడివేముల, జనవరి08, ప్రభాతవార్త ;** రాష్ట్ర అభివృద్ధిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా మరిచాడని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజలపై పెనుభారం మోపాడని టీడీపీ గ్రామ అధ్యక్షులు గిరిబాబు, సీనియర్ నాయకులు బొమ్మన నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని తిరుపాడు గ్రామంలో గ్రామ అధ్యక్షులు గిరిబాబు ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. అధికారం వచ్చిన వెంటనే 2.30 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మాట తప్పారని, గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చే నిరుద్యోగభృతిని రద్దు చేశారని, వచ్చే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని నిరుద్యోగులను వారు కోరారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచేసి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విడిచారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అనుభవజ్ఞుడైన, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని గెలిపించుకుని సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు యుగంధర్‌రెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ వడ్డె రాజు, తిరుపాల్, గ్రామ ఐటీడీపీ అధ్యక్షుడు హరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి అప్పన్న హస్తం అందించిన విశ్వబ్రాహ్మణ సంఘం

**కోడుమూరు,జనవరి 8, రూరల్, ప్రభాతవార్త :** కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో పేదరికంతో బతుకీడుస్తున్న వడ్ల వరలక్ష్మీ కుటుంబానికి మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారు అప్పన హస్తం అందేచేందుకు ముందుకు వచ్చారు. వరలక్ష్మీ భర్త వడ్ల రామాంజినేయులు ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి పెద్ద దిక్కులేకుండా పోయింది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న రామాంజినేయులు ఆకాల మరణంతో ఆ కుటుంబం ఆనాదగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఆదివారం ఆ సంఘం ప్రతినిధులు గ్రామానికి వెళ్లి వరలక్ష్మీ కుటుంబానికి తామున్నామని భోరసా ఇచ్చారు. అనంతరం వారు ఆ కుటుంబానికి రూ.8వేలతో పాటు కుట్టు మిషన్ అందించి మానవతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శ్రీనివాస ఆచారి, వెంకటస్వామి ఆచారి,నాగరాజ ఆచారి,గంజిల్లా శేఖారాచారి,నాగేంద్ర ఆచారి,తిప్పనూరు శేఖారాచారి,నరేష్ ఆచారి,చక్రి,రసూల్ సాహెబ్,గోవిందు ఆచారి, మహేష్ ఆచారి,భాస్కర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాటా వీరేష్

**ఆస్పరి,జనవరి 8,ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ ఆలూరు నియోజకవర్గ టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బిల్లేకల్ గ్రామానికి చెందిన బాటా వీరేష్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బడుగు,బలహీన వర్గాల పార్టీ అన్నారు. బిసిలకు న్యాయం జరగాలంటే టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే జరుగుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు. మున్ముందు పార్టీ కోసం కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. తనను గుర్తించి బిసి సెల్ ఆలూరు నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు,ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ,నియోజకవర్గ పెద్దలు, మండల నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు



**దేవనకొండ,జనవరి 8,ప్రభాతవార్త :** అయ్యప్ప స్వామి మాల ధరించిన దేవనకొండ అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. స్వాముల వారిని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుండి డప్పు వాయిద్యాలతో సాగనంపారు. నియమనిష్టలతో 48రోజుల పాటు మాల ధరించడం వల్ల ఎంతో పుణ్యం కలుగుతుందని అయ్యప్పస్వామి భక్తుల నమ్మకం.

# 'వాల్మీకి జాతి ఐక్యతతోనే ఎస్టీ రిజర్వేషన్ సాధ్యం ..'

## - అట్టహాసంగా వాల్మీకి సంఘం నూతన కమిటీ ఎన్నిక



**కొలిమిగుండ్ల, జనవరి 8, ప్రభాతవార్త**
వాల్మీకి జాతి ఐక్యతతో పోరాటం సాగిస్తేనే మనం కలలుగన్న ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమవుతుందని ఐక్య వాల్మీకి పోరాట కమిటీ నంద్యాల జిల్లా అధ్యక్షులు గోవిందనాయుడు పేర్కొన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని సాయిబాబా ఆడిటోరియంలో మండల వాల్మీకి సంఘం నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ సీతారామయ్య, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, బెలుం హుశేనయ్య, చెక్కా వెంకటరాముడు తదితరుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గోవిందనాయుడు మాట్లాడుతూ వాల్మీకి సోదరులు ఐకమత్యంతో ముందుకు సాగాలని, పార్టీలకతీతంగా జాతి కోసం పాటుపడాలని సూచించారు. ఎస్టీ రిజర్వేన్ వాల్మీకి జాతి హక్కు అని, కలిసి వుంటే తప్పక సాధిస్తామని తెలిపారు. ఎస్టీ రిజర్వేషన్ అంశం రాజకీయ పార్టీల్లో చర్చ జరగడానికి, 2003లో కొలిమిగుండ్లలో జరిగిన వాల్మీకుల 'సింహ గర్జన' సభ ప్రధాన కారణమని గోవిందనాయుడు పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షులు ఉలువల నరసింహులు, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బెలుం హుశేనయ్య మాట్లాడుతూ మండలంలో వాల్మీకులకు అండగా వుంటామని, అందరినీ కలుపుకొని వాల్మీకి సంఘం పటిష్టం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రామాంజనేయులు, డా.కిరణ్ కుమార్, మెడికల్‌స్టోర్ రామక్రిష్ణ, నాయినిపల్లె గోపాల్, శివలింగం, బెలుం శింగవరం మాజీ సర్పంచ్ కంబయ్య, కంబగిరి రాముడు, కట్టుబడి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**వాల్మీకి నూతన కమిటీ ఎకగ్రీవం:** కొలిమిగుండ్ల మండల వాల్మీకి సంఘం నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, అధ్యక్షులుగా ఉలువల నరసింహులు, ఉపాధ్యక్షులుగా బెలుం హుశేనయ్య, బెలుంశింగవరం రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శిగా మీర్జాపురం బాలహుశేనినాయుడు, కార్యదర్శిగా తిమ్మనాయినిపేట మద్దిలేటి, కోశాధికారిగా కనకాద్రిపల్లె ఓబులేషు, జాయింట్ సెక్రటరీగా అంకిరెడ్డిపల్లె లక్ష్మన్న తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆస్పరిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**ఆస్పరి, జనవరి 8, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆస్పరిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆస్పరి యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 13,14,15వ తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు రామకృష్ణ, అరవింద్, మహేష్, నరసింహ, నరసప్ప, విజయ్, హేమంత్‌లు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 11వ తేదీలోపు రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పోటీలలో పాల్గొనాలన్నారు. దాతలు మొదటి బహుమతిని జడ్పిటిసి విరుపాక్షి రూ.20116లు, 2వ బహుమతిని రూ.10,116లు మాజీ జిల్లా గ్రంధాలయ చైర్మన్ శంకర్‌రెడ్డి, 3వ బహుమతిని రూ.5116లు పద్మావతి బోర్వెల్స్ యజమాని మేకల రంగనాథ్‌లు అందచేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9912951780, 7702057770, 9966419020లను సంప్రదించాలన్నారు.

## సుంకులమ్మకు ప్రత్యేక పూజలు చేసిన సర్పంచ్



**మద్దికెర, జనవరి 8, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి 3కి.మీల దూరంలో ఉన్న ఈదుల సుంకులమ్మకు సర్పంచ్ బండారు సుహాసిని, దేవి, నాగేష్, రంగన్నలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళారతి తదితర విశిష్ట పూజలు చేసి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారు సుహాసిని మాట్లాడుతూ ప్రతిఒక్కరు భక్తిభావంతో మెలగాలన్నారు. గ్రామంలో ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

## వైసిపి మూడున్నరేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం



**దేవనకొండ, జనవరి 8, ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప అన్నారు. ఆదివారం జనసేన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని మండలంలోని పల్లెదొడ్డి, గద్దెరాళ్ల గ్రామాల్లో నిర్వహించారు. గ్రామాలలో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడుతూ గద్దెరాళ్ల గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ ఉండడంతో ఉసురుకి సుమారుగా 200ఎకరాలకు పైగా రైతులు వేసుకున్న పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయన్నారు. హంద్రీనీవా అధికారులు చొరవ చూపి హంద్రీనీవా కాలువ నుంచి ఉసురు ప్రవాహం లేకుండా మరమత్తులు చేపట్టి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వంలో పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం మోపారని ఆరోపించారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మక్బూల్, నందు, వీరేష్, బడేసాహెబ్, కృపాకర్, నరేష్, కౌలుట్ల, కార్తీక్, జనసైనికులు పాల్గొన్నారు.

## మాలమల్లేశ్వరుడికి విశేష పూజలు



**హొళగుంద, జనవరి 8, ప్రభాతవార్త :** మండలంలోని నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట గ్రామాల మధ్య ఎత్తైన కొండల్లో వెలసిన దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పంపా స్వామి, మహేష్ స్వామిలు మాల మల్లేశ్వర స్వామికి జలాభిషేకం, బండారు అర్చన, అమ్మవారికి కుంకుమార్చన, మహామంగళారతినిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ప్రతిమెట్టుకు బండారు అంటిస్తూ, చిన్నపిల్లవాడు ఆడుతూ గిరిపైకి ఎక్కారు. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన వసతి కల్పించారు. ఈ పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సివిల్ జడ్జి దివ్య



**పత్తికొండ, జనవరి8, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జర్నలిస్ట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్ సివిల్ జడ్జి దివ్య ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో హెల్త్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, అడ్వకేట్, జర్నలిస్ట్ టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా, ఉల్లాసంగా ఉండేందుకు ఈ టోర్నమెంట్లు ఉపయోగపడతాయాన్నారు. ఎంతో బిజీగా ఉండే ఈ నాలుగు డిపార్ట్‌మెంట్లు వారు మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు ఈ టోర్నమెంట్ దోహదపడుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి విజేతగా పోలీస్ డిపార్ట్‌మెంట్ నిలవగా, రెండవ విజేతగా జర్నలిస్ట్ జట్టు నిలిచింది. గెలుపొందిన విజేతలకు సీల్డ్, మెమొంటోలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, డాక్టర్ కల్పన, సీనియర్ జర్నలిస్ట్ గోపాల్ చౌదరి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, సీనియర్ క్రికెట్ ప్లేయర్ అనిల్, పోలీస్, జర్నలిస్ట్, అడ్వకేట్లు, మెడికల్ డిపార్ట్‌మెంట్ జట్టు సభ్యులు పాల్గొన్నాయి.

## సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు



**హొళగుంద, జనవరి 8, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హొళగుందలోని ఎస్ఎస్‌వి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌కె గిరి, పెద్దహ్యాట మల్లయ్య, ఎస్ఎఫ్ఐ నాగరాజు, మరిమల్ల, ఎస్ఎస్‌వి షబ్బీర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హొళగుందలోని శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 11న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గు, రంగులు తెచ్చుకోవాలని సూచించారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిని ఎస్ఎస్‌వి షబ్బీర్ రూ.5వేలు, రెండో బహుమతిని సర్పంచ్ చలవాది రంగమ్మ తనయుడు పంపాపతి రూ.3వేలు, మూడో బహుమతిని ఎంపిటిసి శివన్న రూ.2వేలు అందచేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 9966969152, 9666030835, 9676840434లను సంప్రదించాలన్నారు.

## యన్‌జిఓ సంఘం ఎన్నికల తుది ఓటరు లిస్టు విడుదల



**కోవెలకుంట్ల, జనవరి 8, ప్రభాతవార్త :** అంధ్ర ప్రదేశ్ యన్‌జిఓ సంఘం ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల కావడముతో అందులో ఉన్న ఓటర్ల తుది జాబితాను ఎన్నికల అదికారు గువ్వల రామకృష్ణారెడ్డి అదివారము విడుదల చేశారు. ఎపి యన్‌జిఓ సంఘం ఎన్నికల అదికారిగా కోవెలకుంట్లకు చెందిన మాజీ యన్‌జిఓ సంఘం రాష్ట్ర ఉపాద క్షులు గువ్వల రామకృష్ణారెడ్డి ఈ ఎన్నికలకు సంబంధించి ఎని క్నల అదికారిగా నియమించడముతో అయన అదివారము విజయవాడలో సంఘంలో ఉన్న మొత్తం ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఈసందర్భముగా ఎన్నికలు ప్రశాంతము నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎని క్నల అదికారి టి.గోపాలకృష్ణ, రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు నలమారి చంద్రశేఖరరెడ్డితో పాటు ఎపి యన్‌జిఓ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## ప్రాతకోటలో తిరుణాలకు ముస్తాబవుతున్న శ్రీఅన్నపూర్ణ కాశీశ్వరస్వామి అలయం



**పగిడ్యాల, జనవరి 8, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలం పడమర ప్రాతకోటలో వెలసిన శ్రీఅన్నపూర్ణ కాశీశ్వరస్వామి, నందీశ్వరస్వామి అలయాలు సంక్రాతి తిరుణాల సందర్భంగా అలయ కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. తరాలుగా సంక్రాతి తిరుణాలకు ప్రాతకోటలో ప్రజలు ఎక్కువ ప్రాదాన్యత ఇస్తువస్తున్నారు. ఈ పండుగకు అడపడుచలను బంధువులను అహ్వానించడం అనవాయితీగా కొనసాగుతుంది. అందున అలయాలను సర్వంగా సుందరంగా తీర్చిదిత్తున్నారు. సమీప గ్రామాల ప్రజలు తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు అత్యధిక సఖ్యలో పాల్గొడం జరుగుతుంది. తిరుణాల ఏర్పాట్లలో అలయకమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు. 13వతేదీన స్వామివారల బండిసేవ, 14న ప్రభోత్సవం, 15న రథోత్సవం, 16న పారువేట, 17న వసంతోత్సవంతో తిరుణాల ముగుస్తుందనీ, తిరుణాల కార్యక్రమాల్లో అందరు పాల్గొని విజయవంతం చేయాలనీ అలయ కమిటీసభ్యులు కోరారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

### - నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి



**బేతంచెర్ల, జనవరి8, ప్రభాతవార్త:** క్రీడలు యువకులకు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధృఢత్వాన్ని పెంచుకునేందుకు దోహదపడతాయని నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి, సీఐ ప్రీతమ్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం స్థానిక శేషారెడ్డి హైస్కూల్ నందు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బేతంచెర్ల మార్నింగ్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్‌తోపాటు ఇతర క్రీడలు పండుగల సందర్భంగా నిర్వహించుకోవడం యువతలో క్రీడ అవగాహన కల్పించడం ఎంతైనా అవసరమన్నారు. ప్రస్తుతం మారుతున్న సమాజంలో యువత సెల్‌ఫోన్లకు బానిసై రోగాల బారిన పడుతున్నారన్నారు. మాజీ ఆటగాళ్లు, స్వచ్ఛంద సంస్థలు క్రీడల పట్ల యువతలో అవగాహన పెంచేందుకు ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ టోర్నమెంట్‌కు 56జట్లు హాజరయ్యాయని సంక్రాంతి పండుగ వరకు టోర్నమెంట్ జరుగుతుందని వారన్నారు. ఇందులో గెలుపొందిన జట్టుకు నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి సహకారంతో మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతిగా శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ బి.సీతారామచంద్రుడు సహకారంతో రూ.20వేలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ స్వరూప్, లింగమూర్తి, పురుషోత్తంరెడ్డి, కృష్ణారెడ్డి, కలాం, ఖలీల్, పలువురు పూర్వ క్రీడాకారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



**ఆలూరు, జనవరి 8, ప్రభాతవార్త :** పట్టణంలోని ఆలూరు-బళ్లారి రోడ్డులోని మారెమ్మ అవ్వ ఆలయ సమీపంలో ఆదివారం ఆలూరు నుంచి బళ్లారి వైపు విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహబూబ్ భాషాను బళ్లారి వైపు నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకుడు స్థానిక కొరియర్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామానుజులు తెలిపారు.

## ఈ నెల 10న పట్టుబడిన వాహనాలకు వేలంపాట

### - సెబ్ సిఐ వెంకట్



**ఆలూరు, జనవరి 8, ప్రభాతవార్త :** ఈ నెల 10వ తేదీన పట్టణంలోని సెబ్ కార్యాలయ ఆవరణలో అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వాహనాలకు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సిఐ వెంకట్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్ ఆదేశాల మేరకు వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు మొత్తం 83వాహనాలకు వేలంపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ప్రవేశ రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సిఐ పేర్కొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల జోలికెళ్తే చర్యలు తప్పవు



**దేవనకొండ, జనవరి 8, ప్రభాతవార్త :** ప్రశాంతమైన గ్రామాల్లో అసాంఘిక కార్యాకలాపాల జోలికెళ్తే ఎంతటివారికైనా చర్యలు తప్పవని ఎస్ఐ భూపాలుడు హెచ్చరించారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. గ్రామాల్లో పేకాట, మట్కా, నాటుసారా వంటివి అమ్మితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఘర్షణలకు దూరంగా ఉంటూ గ్రామాల్లోని ప్రజలు అన్నదమ్ముల మాదిరిగా కలిసి ఉండాలని సూచించారు.

## గుడిసెకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ఆదోని రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దహరివాణం గ్రామంలో రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు కురివాసప్ప నివాసముంటున్న గుడిసె(కొట్టం)కు నిప్పంటించారని సిపిఎం మండల నాయకులు తిక్కప్ప, భాదితులు తెలిపారు. కొట్టంకు నిప్పు పెట్టడంతో సుమారు 2క్వింటాళ్ల బియ్యం, దుస్తులు కాలి బూడిదయ్యాయన్నారు. కురివాసప్ప కుటుంబానికి వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలని అలాగే నిప్పు అంటించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించి కొత్త ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## యూనివర్శిటి ప్రొఫెషర్ ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేయాలి



**నందికొట్కూరు, జనవరి 8, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్‌ను అవమాన పరిచిన రాయలసీమ యూనివర్శిటి ప్రొఫెసర్ ఎం,డి, ఇస్మాయిల్‌ను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బి.ఎస్పీ, సిపిఐ, దళిత సంఘాలు ధర్నా చేసి ప్రొఫెసర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి ఎం.డి.ఇస్మాయిల్ ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్సై ఎన్.వి.రమణకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు స్వాములు, లాజర్, సిపిఐ నాయకులు వి.రఘురాంమూర్తి, ఎం.రమేష్‌బాబు, ప్రసాద్, ఎఐయస్‌యఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనువాసులు, దళిత సంఘాల నాయకులు జాను, పుల్లయ్య, రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్యాప్టో జిల్లా చైర్మన్‌గా ఎస్ గోకారి ఎన్నిక పట్ల హర్షం




**కర్నూలు విద్య, జనవరి 8, ప్రభాతవార్త:** సలాం ఖాన్ భవన్‌లో 4వ తేదిన జరిగిన జిల్లా ప్యాప్టో ఎన్నికల్లో ఎస్టీయు కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్ గోకారి ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల ఎస్టీయురాష్ట్ర ప్రధాన కార్యదర్శి టికె జనార్ధన్, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదాసిర్ అహమ్మద్ రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజులు హార్షం వ్యక్తం చేశారు. ఈసందర ్బంగా వారు మాట్లాడుతూ యస్ గోకారి, 20 సంవత ్సరాలుగా ఉన్నత పాఠశాలలో బౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసు ్త ఎంతోమంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దుతూ, మరోపక ్క విద్యా ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికై రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడుగా పనిచేస్తు జిల్లా పా ్యప్టో చైర్మన్‌గా ఎన్నికయినందులకు ఎస్టీయు భవనంలో పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు.

## యువశక్తి సభ పోష్టర్లను విడుదల చేసిన జనసేన నాయకులు



**నందికొట్కూరు, జనవరి 8, ప్రభాతవార్త:** ఈ నెల 12న శ్రీకాకుళంలో జరిగే యువశక్తి బహిరంగ సభ పోష్టర్లను జనసేన నాయకులు విడుదల చేశారు. ఆదివారం స్తానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేనా రామన్న మాట్లాడుతు వైకాపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు జాబ్ కాయలెండర్ ఇవ్వడం జరిగిందే కాని దానిని అమలు చేయలేదని, మాటల ప్రభుత్వంగా తయారయిందన్నారు. వైకాపా ప్రభుత్వంలో నిరుద్యోగులు పెరిగి పోతున్న పరిశ్రమలు తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జనసేన ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని నల్లమల రవికుమార్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకర్ల కిరణ్‌కుమార్, నవీన్‌రెడ్డి, శేషు, బోరెళ్ళి వెంకటేష్, శేషన్న, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లు నిర్మించుకోక పోతే ఇంటి పట్టా రద్దు



**కలుగొట్ల(కోవెలకుంట్ల), జనవరి 8, ప్రభాతార్త:** రాష్ట్ర పేదలకు కోసం మంజూరు చేసిన ఇంటి నిర్మాణము చేపట్టాక పోతే వారికి ముందుగా ఇచ్చిన ఇంటి స్థలము పట్టా రద్దు చేస్తామని మండల అబివృద్ధిఅదికారి మహమ్మద్‌దౌలా, తహశీలుదారు పుష్పకుమారిలు అన్నారు. మండల పరిదిలోని కలుగొట్ల గ్రామంలో జగనన్నశాశ్వత గృహ లబ్దిదారులతో వారు సమావేషము నిర్వహించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ మీకు ప్రభుత్వం డబ్బులు ఇచ్చి ఇళ్ల నిర్మించుకోవాలిని అంటే మీరు నిర్మిణము చేపట్టకుండా మొండికి వేస్తున్నారని చెప్పారు. ఇలాగే చేస్తే ప్రభుత్వం ముందుగా మీకు ఇచ్చిన ఇంటి జాగాను రద్దు చేయడము ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపియం గురుస్వామి, డిప్యూటి తహశీలుదారు చంద్రశేఖరు, ఇతర శాఖలఅదికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు మనోధైర్యము నింపితే వారికి కొండంత బలం



**అమడాల(కోవెలకుంట్ల) జనవరి 8, ప్రభాతవార్త :** మనలను నమ్ముకున్న కార్యకర్తలకు పలుకరించి మనోధైర్యము నింపితే వారికి కొండంత బలమని మాజీ యంయల్ఎ బిసి జనార్ధనరెడ్డి సతీమణి, బిసి ఇందిరారెడ్డి అన్నారు. కోవెలకుంట్ల మండలంలోని అమడాల గ్రామంలో తెలుగు దేశం పార్టి కార్యకర్త బద్రీ.వినోద్‌కుమారరెడ్డి తల్లి ఇటీవల వంట చేస్తుండగా పొరపాటున వేడి నూనె అమె వంటిపై పడటముతో అమెను హుటా హుటిన అసుపత్రికి తరలించి వైదద్యము అందించారు. అయితే అదివారము అమె డిచార్జి కావడముతో బిసిఇందిరారెడ్డి అమడాలకు చేరుకుని అమెనె ఓదార్చారు. ఈసందర్భముగా కార్యకర్తలకు నాయకుడు ముందుగా మనోధైర్యము నింపాలని అది వారికి కొండంత బలమని చెప్పారు., ఈమె వెంట తెలుగు యువత నియోక వర్గ అద్యక్షుఉ అబిరుచి మద్దులేటి, తెలుగు దేశం కార్యకర్తలు ఉన్నారు.

## చదువుకున్న పాఠశాలలో సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



**వెల్దుర్తి, జనవరి8, ప్రభాతవార్త :**
చదువుకున్న పాఠశాలకు, విద్యార్థులకు అవసరమైన సేవాకార్యక్రమాలు, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా వెల్దుర్తి జడ్పీ హైస్కూల్ పూర్వపువిద్యార్థుల సేవాసంఘం పనిచేస్తుందని ఆ సంఘం అధ్యక్షులు వావిలాల క్రిష్ణమూర్తి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో ఆదివారం పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి గత ఏడాది వరకు చదివిన ఎస్ఎస్‌సి బ్యాచ్ వరకు పూర్వపువిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన పూర్వపువిద్యార్థులు వారి గురువులను సన్మానించారు. అనంతరం గురువుల చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గురవులతో కలిసి పూర్వపువిద్యార్థులు సహాంపక్తి భోజనం చేశారు. సంఘం ఏర్పాటు అయిన నాటినుంచి చేస్తున్న సేవలను కొనియాడారు. గురువులను గౌరవించడంతో అంతే మంచే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు శంకరయ్య, మోహన్‌రెడ్డి, క్రిష్ణమోహన్, బాలికల హైస్కూల్ హెచ్ఎం విజయకుమారి, పూర్వపువిద్యార్థులు సేవాసంఘం సభ్యులు పిటి రామక్రిష్ణ, బొమ్మనసుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, వరప్రసాద్, శేషన్న, రవి, లక్ష్మణ్, ఆగస్టీన్, ఖాజాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

# భూమా అంటే ఒక బ్రాండ్ - అందరివాడు...

**- దివంగత నేత మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా**
**- మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి**



**నంద్యాల విద్య, జనవరి 8, ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి ప్రజల మనిషి అని నంద్యాలతో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన అభిమానులను సంపాదించుకొని ఒక బ్రాండ్‌గా రూపొందిచుకొని అందరివాడుగా ఉన్నాడని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో భూమా నాగిరెడ్డి 59వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆళ్లగడ్డ వెళ్లి భూమా నాగిరెడ్డి ఘాట్‌ను సందర్శించి నివాళ్లు అర్పించారు. అనంతరం పట్టణంలోని తన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి సంబరాలను జరుపుకున్నారు. పట్టణంలో భూమా నాగిరెడ్డి చేసిన అభివృద్ధి గురించి అందరు కొనియాడారు. నంద్యాల పట్టణంలో రోడ్ల వెడెల్పు, అమృతస్కీం పథకం, కుందూనది వంతెనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. బాబాయ్ ఆశయాలకు అనుగుణంగా సేవాకార్యక్రమాలు చేస్తు ప్రజలకు అండగా ఉన్నారన్నారు. టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా వైసీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధి కి నోచుకోలేదన్నారు. దివంగత నేత భూమా నాగిరెడ్డి నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఎదురులేని నాయకుడిగా నిలిచి పేద ప్రజలకు ఎనో న్నసేవా కార్యక్రమాలు చేసిన ఘనత ఆయనదే అన్నారు. మరణించే ముందు నంద్యాల్లో పేద ప్రజలకు 10 వేల పక్కా గృహాలు ఇస్తామని ఇచ్చిన మాట మేరకు ఆయన మరణం తరువాత అదిసాధ్య మయిందని పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి అన్నారు.



భూమా అంటేనే అభివృద్ధి అని కార్యకర్తలకు అండగా ఉండేవారన్నారు. నంద్యాల, గోస్పాడు టిడిపి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ఈసందర్భంగా అభిమానులు రక్తదానం శిబిరంలో పాల్గొన్నారు. అనేకమంది రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. స్టార్‌డైరీ అధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను మార్కెట్ యార్డు చేశారు. మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సతీమణి ప్రతిభ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాబువలి, కౌన్సిలర్ పిచ్చుక నాగార్జున, విజయ భాస్కర్‌రెడ్డి, జిల్లెల శ్రీరాములు, చెన్నమ్మ, చాబోలి ఇలియాస్, జైనాబి, మద్దికెర కైలాస్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్‌వి సుబ్బారెడ్డి 89వ జన్మదిన వేడుకలు

**కర్నూలు విద్య, జనవరి 8, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి, విజయమనోహరిల స్వగృహం నందు జిల్లా పెద్దాయన, మాజీ మంత్రివర్యులు ఎస్‌వి సుబ్బారెడ్డి 89వ పుట్టినరోజు వేడుకలు కుటుంబసభ్యులు, ఆత్మీయుల మద్య కేక్‌కట్ చేసి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి జనక దత్తారెడ్డి, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యులు కనకదుర్గ, స్వరూప, శిరీష, లక్ష్మీ, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ హర్షిత్‌రెడ్డి ఇతర సమీప బంధువులు, 33వ వార్డుకు చెందిన వైసిపి నాయకులు, ఎస్‌వి యూత్ పాల్గొన్నారు.



## నేడు స్పందన కార్యక్రమం

**నంద్యాల విద్య, జనవరి 8, ప్రభాతవార్త:** ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. ప్రజల నుంచి ఫిరా ్యదులు స్వీకరించే స్పందన కార్యక్రమం ఉదయం 9 నంచి ప్రారంభవం అవుతుందనా ్నరు. జిల్లాలోని అధికారులందరు తప్పనిసరిగా హారుజకావాలన్నారు. జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్‌స్థాయిలో కూడ యదాతదంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచివచ్చే అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లాలోని అధికారులందరు హాజరుకావాలని ఆయన అదేశించారు.

# అక్షరం ఆయుధంగా నిజాలు నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకొచ్చేది వార్త

**- పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి**
**- తెలుగు జాతీయ దినపత్రిక వార్త**
**- 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి...**



**వెల్దుర్తి, జనవరి8, ప్రభాతవార్త :** అక్షరం ఆయుధంగా నిజాలు నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకొచ్చేది వార్త దినపత్రిక అని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్యే స ్వగృహంలో ఆదివారం తెలుగు జాతీయ దినపత్రిక వార్త-2023 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శ్రీదేవి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై వార్తలు రాసి వాటిని పరిష్కరించే దిశగా వార్త తీసుకెళ్తుందన్నారు. ప్రారంభ దశ నుండి ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల మధ్యకు దూసుకు పోతున్న తెలుగు జాతీయ దిన పత్రిక వార్త అని ఆమె పేర్కొన్నారు. ప్రాంతాలు, రాజకీయాలు, వర్గాలు, కులమత ాలకు అతీతంగా పత్రికా రంగంలో తనదైన వ్యవహా రశైలితో జర్నలిజానికి ఉన్న గౌరవాన్ని ఇనుమడింపజేసి వార్త ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దురి ,క్రిష్ణగిరి మండలాల వార్త దినపత్రిక పాత్రికేయులు అమీర్, అనంతయ్య తదితరులు పాల్గొ న్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో ఉత్తమ గాయకుడిగా జి.శ్రీనివాస్‌కు చోటు



**కర్నూలు జిల్లా పరిషత్, జనవరి 8, ప్రభాతవార్త :** తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో ఉత్తమ గాయకుండిగా కర్నూలు పట్టణానికి చెందిన గుర్రాల శ్రీనివాస్‌కు చోటు దక్కింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు దశమ వార్సికోత్సవంను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని శుభం ఫంక్షన్ హాల్‌లోఏఎస్ఎస్, 24 టివి ఛానళ్లు, భద్రాది స్వర నీరాంజలి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వర నీరాజనం ఆదివారం నిర్వహి ంచారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రలకు చెందిన 111 మంది గాయకులు పాల్గొని 11 గంటల పాటు ఏకదాటిగాభక్తి, సినిమా పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో కర్నూలు పట్టణానికి చెందిన గుర్రాల శ్రీనివాసులు పాల్గొని తన పాటతో ప్రేక్షకులను, జడ్జీలను అలరించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుని ఉత్తమ గాయకుడిగా ప్రశంసా పత్రం, మెమొంటో అందుకున్నారు. జి.శ్రీనివాసులు కర్నూలు పట్టణంలోని సరిగమ సినీ ఆర్కెస్ట్రా వారు నిర్వహిస్తున్న వర్ధమాన గాయకులు పుష్పరాజు శిక్షణలో 7 నెలల పాటు శిక్షణ పొందారు. ఈ రోజు భద్రాచలంలో నిర్వహించిన స్వర నీరాజనంలో ఉత్తమ మధుర గాయకుడిగా అవార్డు, ప్రశంసా పత్రంను అనుమాండ్ల నాగరాజు, పోకల పద్మావతి చేతుల మీదుగా అందుకున్నారు. దీంతో కర్నూలు సినీ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు గోల్కొండ లతీఫ్, ఆర్గనైజర్ సీనియర్ సింగర్ పుష్పరాజు తదితరులు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అర్డులు పొంది సినీ ఆర్కెస్ట్రాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

## వాల్మీకి మహర్షి దేవాలయానికి ఎమ్మెల్యే విరాళం



**ఆదోని, జనవరి 8, ప్రభాతవార్త :** వాల్మీకి మహర్షి నూతన దేవాలయానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రూ.10,1000 విరాళం అందించినట్లు కల్లుబావి వాల్మీకి బోయ యువకులు, పెద్దలు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ వాల్మీకి బోయ యువకులు, పెద్దలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి వాల్మీకి మహర్షి నూతన దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కోరగా ఎమ్మెల్యే సాయి మంచి మనసుతో రూ.1లక్ష1వెయ్యి విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# రమణీయం.. రథోత్సవం..!

**- మారుమ్రోగిన శివనామస్మరణం**
**- అశేష భక్తుల నడుమ కదిలిన మహారథోత్సవం**
**- రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు**



**ఎమ్మిగనూరు. జనవరి08 ప్రభాతవార్త:** హర..హర మహదేవా..! అంటూ భక్త జన సంరక్షక నామస్మరణతో ఆదివారం ఎమ్మిగనూరు పట్టణం మారు మ్రోగింది. వేద పండితుల మంత్రోచ్చారణ.. మంగళ వాయిద్యాల నడుమ సాగిన శ్రీనీలకంఠేశ్వర స్వామి రథోత్సవం భక్తజన సంద్రంగా మారింది. అశేష భక్తుల హర్షద్వానాల మధ్య జాతర సంబరం అంబరాన్నంటింది. సాయంత్రం 6గంటలకు మొదలైన మహా రథోత్సవంలో దాదాపు లక్షల్లో భక్తులు పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో కొలువైన శ్రీనీలకంఠునికి పురోహితులు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం తేరుబజారు వరకు ఉత్సవమూర్తి ముక్కంటిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామిని పీఠంపై అధిష్టింపజేసి హోమం చేపట్టారు. పూర్ణకుంభంతో స్వామికి నైవేద్యం సమర్పించి హోమం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని మహారథోత్సవంపై అధిష్టింపజేసి హారతిపట్టారు. ఆ తర్వాత భక్తజనుల మద్య శివనామ స్మరణములతో రథం కన్నులపండువగా ముందుకు కదిలింది. రథం లాగి స్వామి కృపకు పాత్రులయ్యేందుకు భక్తులు పోటీ పడ్డారు. రథోత్సవం శ్రీమార్కెండేయ స్వామి ఆలయం వరకు చేరుకోగానే స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహారథాన్ని తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు తరలిరావడంతో ఎమ్మిగనూరు పట్టణం కిక్కిరిసి పోయింది. అంతేకాకుండా ఆలయ ఆర్చకులు విశేష పూజలు, గోరవయ్యల నృత్యాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి.

**రథోత్సవంను తిలకించిన ప్రముఖులు..!**

ఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి రథోత్సవం సంధర్బంగా ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వరరెడ్డి, సినియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, కర్నూలు మాజీ ఎంపి బుట్టారేణుకా, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వై సీతారామిరెడ్డి, మంత్రాలయం టీడిపి ఇంచార్జి పి తిక్కారెడ్డి, వైకాపా వీరశైవ లింగాయత్ కార్పోరేషన్ ఛైర్మన్ వై రుద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవచనీయ సంఘటనలు జరగకుండా ఆదోని డిఎస్‌పి వినోద్‌కుమార్, సిఐ మధుసుధన్‌రావు సంక్షములో పట్టిష్ట బదోబస్తు నిర్వహించి ప్రశాంతముగా ఉత్సవ కార్యక్రామని ఘనంగా నిర్వహించారు.



## రైతు భరోసా కేంద్రాలతో మెరుగైన సేవలు..

**- ఆర్బీకేతో పాటు రైతు ఉత్పత్తుల నిల్వ భవనం ప్రారంభం..**

**దుద్ది(కోసిగి), జనవరి 8, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సత్వరమే వ్యవసాయ పరంగా సేవలను అందించడం జరుగుతుందని మంత్రాలయం ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి అన్నారు.. ఆదివారం మండల పరిధిలోని దుద్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రంను, అలాగే రైతు ఉత్పత్తుల నిల్వ భవనాన్ని ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి ప్రారంబించారు..ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మురళీమోహన్‌రెడ్డితో కలసి ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి కోసిగి మండలంలో పర్యటించారు.. ముందుగా దుద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్బీకేలను ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి మట్లాడుతూ ఆర్బీకే వ్యవస్థ ద్వారా రైతులకు మరింత చేరువుగా ఉంటూ రైతు సమస్యలను పరిష్కరించండంతో పాటు రైతు సంక్షేమ పథకాలను వారికి సక్రమంగా అందే విధంగా ఆర్బీకే సిబ్బంది పనిచేసి వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు.. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమనే విధంగా ఈ రైతు భరోసా కేంద్రాలు పనిచేయాలన్నారు.. అంతేకాక కేంద్రానికి రైతులు రాకపోతే సిబ్బంది వారి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వారికి ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలను వచ్చే విధంగా చూడాలన్నారు.. మరీ ముఖ్యంగా పంటలు వేసిన ప్రతి రైతు పొలంకు వెళ్లి పంట నమోదు చేసి ఈకేవైసి తప్పని సరిగా చేయాలని, దీంతో వారికి ప్రభుత్వం నుండి అందాల్సిన పథకాలన్ని అందే విధంగా ఈ రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తాయన్నారు.. ఇక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేని సమయంలో వారి పండించిన ధాన్యంను నిల్వ చేసుకునేందుకు ఈ గిడ్డంగి ఉపయోగ పడుతుందన్నారు.. గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులు పండించిన పంటలను ఇక్కడనే నిల్వ చేసుకోవచ్చని తెలిపారు.. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం స్టాల్‌ను పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లవకుశ ఈరన్న, తహాశీల్దార్ రుద్రగౌడ్, వ్యవసాయా సహాయ సంచాలకులు గిరీష్, పంచాయతీరాజ్ డీఈ అశ్వత్థామ, ఏఈ యుగంధర్‌రెడ్డి, సాగుసంఘం మాజీ అధ్యక్షులు ఐరన్‌గల్ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షులు బెట్టన్నగౌడ్, నాయకులు నాడిగేని నరసింహులు, మాణిక్యరాజు, దళావాయి మంగమ్మ, నాడుగేని నాగరాజు, యువనాయకులు జగదీష్‌స్వామి, చూడి బసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు..



## గణితంలో దిట్ట ఆ చిన్నారి..!

**- సులువుగా లెక్కల్లో అందే...వేసిన నిహారిక**



**నంద్యాల విద్య, జనవరి 8, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లా పరిధిలోని ఎన్‌జిఓ కాలనీలో ఉన్న గుడ్‌షెప్పర్డు ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న చినా ్నరి సంటిగారి అందెల నిహారిక గణితంలో పట్టుసాధించి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. గణిత దినోత్సవం సివి రామన్ జయంతి సందర్భంగా ఎంఆర్ గోవిందరెడ్డి మెమోరియల్ వారు నిర్వహించిన గణితంలో కాంటెస్టు నిర్వహించారు. ఇందులో పలువురు చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో నిహారిక కూడ లెక్కలు సులువుగా చెప్పడంతో అందేవేసిన విధంగా అందరిని అలరిస్తు గణితంలో దిట్ట అనిపించుకున్నారు. తండ్రి జయకిశోర్‌రాజ్, తల్లి అరుణకుమారి, గ్రాండ్‌పేరెంట్స్ అయిన మరియమ్మ, జయప్రకాష్‌లు అతర్వభీమల్, విక్రాంతి రాజవర్ధన్, ఆశోక్‌రాజవర్ధన్‌లు ఇచి ్చన ప్రొత్సాహంతో ఈప్రశంస పత్రం సాధ్యమయిందని పేర్కొన్నారు. ప్రశంసపత్రం లభించడంతో నీలిమా స్వర్ణలత, దొరస్వామి, జార్జ్ జోయల్ హర్షిత్, జాన్ బన్విన్‌లు అభినందించారు. భవిష్యత్తులో గణితంలో మరింత పట్టుసాధించి ముందుకు పోవాలని వారు అశించారు. ప్రశంసపత్రం రావడంలో ప్రిన్సిపాల్ జేస్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## శ్రీగిరిలో 12 నుండి సంక్రాంతి మహోత్సవాలు

**శ్రీశైలంప్రాజెక్టు, జనవరి08, ప్రభాతవార్త :** శ్రీశైలం మహపుణ్యక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకోని ఈ నెల జనవరి 12 వ తేది నుండి 18 వరకు సంక్రాంతి మహోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న తెలిపారు. సంప్రదాయాన్ని అనుసరించి శ్రీ మల్లికార్జునస్వామివారికి ఏటా రెండు మార్లు అనగా మకర సంక్రమణం సందర్బంగా సంక్రాంతి మహోత్సవాలు మరియు మహశివరాత్రి సందర్బంగా శివరాత్రి బ్రహ్మోత్స వాలు జరుగనున్నాట్లు పేర్కన్నారు. కాగా 12 వ తేది నాడు శ్రీస్వామివారి యాగశాల ప్రవేశంతో అయా కైంకర్యాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉత్సవాల సందర్బంగా ఈ నెల 12 వ తేది నుండి 18 వ తేది వరకు ఆర్జిత మరియు ప్రత్యక్ష, పరోక్ష సేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, శ్రీ సుబ్రహ్మణేశ్వం స్వామి వారి కల్యాణం మరియు శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలుపుదల చేయడం జరుగుతుందని వివరించారు. భక్తులు ఈ విషయంను గమనించవలసిందిగా తెలియపరచడం జరిగింది.



## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**ఓర్వకల్, జనవరి08, ప్రభాతవార్త ;** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఓర్వకల్ మండలం కాల్వ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాల్వ గ్రామానికి చెందిన పూసల మద్దిలేటి కుమారుడు పూసల శేఖర్(22) భార్య లలితతో కలిసి తెలంగాణ రాష్ట్రంలోని పెబ్బేరులో బట్టల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే కుటుంబ కలహాలతో తన ద్విచక్ర వాహనంపై పెబ్బేరు నుంచి కాల్వ గ్రామానికి చేరుకుని తన సొంత ఇంట్లో ఆదివారం తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ప్రశాంతంగా గ్రూప్-I పరీక్షలు



**కర్నూలు, జనవరి 08, ప్రభాతవార్త :** ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు నిర్వహించారు. ఆదివారం కర్నూలు నగరంలో రవీంద్ర విద్యానికేతన్, మాంటిస్సోరి స్కూల్, రవీంద్ర, నారాయణ జూనియర్ కళాశాలు, రవీంద్ర, శంకరాస్, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల నిర్వహణను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు గాను జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులతో పాటు తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లు సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించకూడదని సిబ్బందికి జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు పరీక్ష కేంద్రాలకు పోలీసు గట్టి బందొబస్తుతో తీసుకెళ్లడంతో పాటు పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను సరైన కవర్లలో ప్యాకింగ్ చేసి గట్టి బందొబస్తుతో ట్రెజరీకి చేర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చెయ్యాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఈ రోజు జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు 9,651 మంది దరఖాస్తు చేసుకోగా ఉదయం పరీక్షకు 6,908 మంది హాజరు అయ్యారని, మధ్యాహ్నం పరీక్షకు 6,861 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సమక్షంలో సంబంధిత పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాలను పంపిణీ చేశారు.

# జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి..

**- గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం తాగునీటి కొళాయిలు..: ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి..**

**గౌడగల్లు(కోసిగి), జనవరి 8, ప్రభాతవార్త :** జలజీవన్ మిషన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి శుద్దమైన మంచినీటి కొళాయిలను అందించేందుకు కృషి చేస్తున్నాడని మంత్రాలయం ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి అన్నారు.. ఆదివారం మండల పరిధిలోని గౌడగల్లు గ్రామంలో మండల ఇంచార్జీ మురళీమోహన్‌రెడ్డితో కలసి సర్పంచ్ శివమ్మ అధ్యక్షతన, రక్షిత మంచినీటి పథకం ఇంజనీరు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి ఇంటింటికి కొళాయి కనెక్షన్‌ను ప్రారంభించారు..ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఈ గౌడగల్లు గ్రామంలో గత ఎన్నో ఏళ్ల నుండి తాగునీటి కోసం గ్రామస్తులు ఎంతో కష్టపడేవారని, వారి కష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి సహకారంతో ఈ గ్రామానికి తాగునీటి సమస్యను తీర్చే విధంగా జలజీవన్ మిషన్‌ద్వారా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.. ఇందుకు అన్ని విధాలుగా సింగల్‌విండో అధ్యక్షులు మఠం మహంతేష్ ముందుంటి ఈ పనులు చేయడం అభినందనీయమన్నారు.. అలాగే ఈ పథకాన్ని కోసిగి మండలంలోని అన్ని గ్రామాలకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు..అనంతరం మంచినీటి కొళాయిలను ప్రారంభించారు..ఈ కార్యక్రమంలో ఎంపీపీ లవకుశ ఈరన్న, సీనియర్ నాయకులు బెట్టన్నగౌడ్, నాడుగేని నరసింహులు, మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు, యువనాయకులు జగదీష్‌స్వామి, జుమ్మలదిన్నె నాగమ్మ, మహంతేష్ స్వామి, గ్రామ నాయకులు మహాదేవ, తదితరులు పాల్గొన్నారు..

